క్లుప్తంగా

అప్పుడు తండ్రి.. నేడు తల్లి


మృతిచెందిన రమాదేవి

దాచేపల్లి: స్థానిక అలంకార్ థియేటర్ సమీపంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై మంగళవారం ట్రాక్టర్‌ని ఆటో ఢీకొట్టటంతో మహిళ మృతిచెందింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న శ్రీనగర్‌కు చెందిన దొప్పలపూడి రమాదేవి(36) మృతి చెందగా ఆమె కుమారుడు సాత్విక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రయాణికులతో దాచేపల్లి నుంచి శ్రీనగర్‌కు వెళ్తున్న ఆటో .. ముందుగా వెళ్లుతున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఆటో బోల్తాపడటంతో డ్రైవర్ పక్కనే కుర్చున్న రమాదేవి తల రోడ్డు డివైడర్‌కు తగలటంతో తీవ్ర రక్తస్రావమైంది. గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ రమాదేవి మృతిచెందింది. ఆమె చిన్న కుమారుడు సాత్విక్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు. ఘటనా స్థలాన్ని సీఐ బిలాలుద్దీన్, ఎస్ఐ సంధ్యారాణి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి కుమారులు సామ్యేలు, సందీప్, సాత్విక్ ఉన్నారు. మృతురాలి భర్త దొప్పలపూడి మహేష్ రెండేళ్ల క్రితం పొందుగల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. తల్లిదండ్రులిద్దరూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందటంతో కుమారులు రోధిస్తున్నారు.

సంక్షేమంలో ఏపీ మొదటి స్థానం



దాచేపల్లి: సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో ఉందని మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి అన్నారు. నారాయణపురం ఆర్ అండ్‌బీ బంగ్లాలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. పార్టీలకతీతంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఎన్నికల హామీలను 90శాతానికి పైగా సీఎం వైఎస్ జగన్ అమలు చేశారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, ముడేల వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ విజయరామారావు, నాయకులు నడికుడి సూర్రెడ్డి, కొప్పుల గిరి, శ్రీరాములు, కొగంటి మణికంఠ, పల్లపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు గురజాల విద్యార్థి

గురజాల: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు గురజాలకు చెందిన కత్తి ఆకాష్ ఎంపికయ్యాడు. ఈ నెల 26న రేపల్లెలో జరిగిన తైక్వాండో పోటీల్లో అతను గోల్డ్ మెడల్ సాధించాడు. మార్చి 11, 12, 13వ తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. మంగళవారం ఆకాష్‌ను వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎనుముల మురళీధర్‌రెడ్డి, నగర పంచాయతీ వైస్ చైర్మన్ షేక్ బడేజానీ, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ నాగులు మీరా, షేక్ నాసర్ సైదా తదితరులు అభినందించారు.

సిమెంట్ లారీ బోల్తా

గురజాల: సిమెంటు బస్తాలతో వెళ్తున్న లారీ మంగళవారం బోల్తా కొట్టింది. వివరాల మేరకు.. కారంపూడిలోని సిమెంటు ఫ్యాక్టరీ నుంచి సిమెంట్ బస్తాలతో రెంటచింతలకు లారీ వెళ్తోంది. మార్గ మధ్యలో చర్లగుడిపాడు గ్రామంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న నల్లవాగులోకి బోల్తా పడింది. లారీలోని 300కు పైగా సిమెంటు బస్తాలు వాగులో పడ్డాయి. డ్రైవర్‌కు చిన్నపాటి గాయాలు కాగా వెంటనే గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి స్థానికులు తరలించారు. లారీలో కూలీలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

12 మంది జూదరుల అరెస్ట్

దాచేపల్లి: పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ షేక్ బిలాలుద్దీన్ మంగళవారం తెలిపారు. అందిన సమాచారం మేరకు.. మండలంలోని పెదగార్లపాడు గ్రామ సమీపంలో పేకాట స్థావరంపై దాడి చేసి, 12 మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వారి నుంచి రూ. 37వేల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

శరవేగంగా రీ-సర్వే

విజయపురిసౌత్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం రీ-సర్వే పనులు మండలంలోని తాళ్ళపల్లి, పశువేముల, నాగులవరం గ్రామాల్లో శరవేగంగా జరుగుతున్నట్లు తహసిల్దారు జి.రమేష్‌బాబు మంగళవారం తెలిపారు. విజయపురిసౌత్‌లో డ్రోన్ ద్వారా సర్వే పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఫణీందర్, సర్వేయర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలను స్ఫూర్తిగా తీసుకోవాలి

పిడుగురాళ్ల: విద్యార్థులు శాస్త్రవేత్తలను స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రాముఖ వ్యాపారవేత్త కె. శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులను ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లింగాల ధనలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.11.93కోట్లతో మాచర్ల పురపాలక బడ్జెట్

చైర్మన్ బోయ రఘురామిరెడ్డి



మాచర్ల: పురపాలక సంఘం అభివృద్ధికి రూ. 11.93 కోట్లతో బడ్జెట్ రూపొందించినట్లు మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పురపాలక సంఘ బడ్జెట్ సమావేశం జరిగింది. చైర్మన్ బోయ రఘురామిరెడ్డి అధ్యక్షత వహించగా, కమిషనర్ ఈవీ రమణ బాబు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రూ.7కోట్లకు పైగా గ్రాంట్లు రూపంలో మిగిలిన రూ.5కోట్లు పన్నుల రూపంలో మున్సిపాలిటీకి ఆదాయం వస్తుందని తెలిపారు. అందులో నీటి సరఫరాకు 20 శాతం, డ్రెయినేజీకి 13శాతం, రహదారులకు 19 శాతం, వీధి దీపాలకు 7శాతం, వినోద సౌకర్యాలకు 10శాతం, మరుగుదొడ్లకు 10శాతం, మార్కెట్, పార్కులు, భవనాలు, కమ్యూనిటీ హాళ్లకు 7శాతం నిధులు కేటాయించారు. మురికి వాడల అభివృద్ధికి 40శాతం, షెడ్యూల్ కులాల అభివృద్ధికి 15శాతం, ఎస్టీల అభివృద్ధికి 7 శాతం, స్త్రీ, శిశు సంక్షేమానికి 5శాతం నిధులు కేటాయించారు. బడ్జెట్‌ను ఏకగ్రీవంగా సభ్యులు ఆమోదించారు. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సహకారంతో పట్టణాభివృద్ధికి, మంచినీటి పథకానికి రూ.114 కోట్లు, జగనన్న కాలనీ, ఇతర పనులకు రూ.32కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. కౌన్సిలర్లు గట్లా అరుణకుమారి, వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మదార్‌సాహెబ్, షేక్ కరిముల్లా, మస్తాన్ పలు సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కమిషనర్ రమణబాబుకు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్, కౌన్సిలర్లు పోలా శ్రీను, మాచర్ల చిన ఏసోబు, మందా సంతోష్, మాచర్ల సుందరరావు, రామిశెట్టి వెంకటేశ్వర్లు, ఎంఆర్ఎఫ్ రామాంజనేయరెడ్డి, నాగుల్ మీరా, బత్తిన వేణు, శంకర్, చందూ గౌడ్, కలివెల జ్యోతి, జగన్‌మోహన్‌రావు, జగన్నాథం శివయ్య, తేరాల సిద్దయ్య, బత్తుల నరసింహారావు, ఎం.శ్రీనివాసరావు, కో-ఆప్షన్ మెంబర్లు అల్లి జీవన్, అనంతరావమ్మ, యాసిన్, అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాచర్ల: పట్టణం, రూరల్ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ డీఈ ఎ.రామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్న కాలనీలకు కొత్త విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేసేందుకు, కొప్పునూరు, అనుపు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం మరమ్మతుల నిమిత్తం సంబంధిత సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలో సుద్దగుంతల, సొసైటీ, రింగురోడ్డు, సాగర్ రోడ్డు, కొప్పునూరు లిఫ్ట్ ఇరిగేషన్ అన్ని ప్రాంతాల్లోని ప్రజలు సహకరించాలని తెలిపారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న పాఠశాల హెచ్‌ఎం శాస్త్రి


మహేష్ కుమార్ బహుమతి అందజేస్తున్న జిల్లా సైన్స్ అధికారి


సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

గురజాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. హెచ్‌ఎం సీహెచ్ లక్ష్మణ్ రావు వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సైన్సు టీచర్ పి.రమాదేవి, ఉపాధ్యాయులు పి.సుదర్శన రావు, వి సరస్వతి, రామి భాయి, ఉపాధ్యాయులు ఉన్నారు. ఉపాధ్యాయుడు తాళ్లూరి అరుణ్‌కుమార్ బహుమతులు అందించారు.

మాచర్ల: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పట్టణంలో పలు పాఠశాలల్లో మంగళవారం నిర్వహించారు. సొసైటీ కాలనీలోని కిడ్స్ పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణశాస్త్రి, అసిస్టెంట్ హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, సైన్స్ టీచర్ల ఆధ్వర్యంలో విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. రైల్వేగేటు పక్కనున్న జడ్పీ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఐవీ నాగమణి ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శనలు నిర్వహించారు.

సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

రెంటచింతల: శాస్త్రవేత్త, నోబెల్ గ్రహీత సీవీ రామన్‌ను విద్యార్థులకు ఆదర్శమని ఎంఈఓ ఐ. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులు ప్రదర్శించిన కవులు, శాస్త్రవేత్తల వేషధారణలు, సైన్స్ ప్రాజెక్టులను ఆయన హెచ్‌ఎం సిస్టర్ లిల్లీట్రిజ, ఉపాధ్యాయులతో కలిసి సందర్శించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ అనిత లిల్లి, డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ పూర్ అధ్యక్షురాలు తామసమ్మ, సిస్టర్ సంధ్యారాణి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో జెట్టిపాలెం విద్యార్థి ప్రతిభ

రెంటచింతల: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో మండలంలోని జెట్టిపాలెం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి కె.మహేష్‌కుమార్ ద్వితీయ బహుమతి సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపల్ కె.పాపయ్య మంగళవారం తెలిపారు. ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడ పట్టణంలోని లయోలా కళాశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో 9వ తరగతి విద్యార్థి మహేష్‌కుమార్ రూపొందించిన పీ యాప్‌కు ద్వితీయ బహుమతి లభించిందన్నారు. ఈ యాప్‌లో అతి తక్కువ మెమొరిలో ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటి డిజిటల్ యాప్‌ల సమాచారాన్ని పొందుపరుచుకోవచ్చన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష పూజలు

పిడుగురాళ్ల: పట్టణంలోని నాగుల గుడి దేవస్థానంలోని సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించి, భక్తుల భక్తులకు దర్శనం కల్పించారు.

అక్రమ మైనింగ్.. ఉపేక్షించేది లేదు

గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

మాచవరం: గురజాల నియోజకవర్గంలో అక్రమ మైనింగ్, అసాంఘిక కార్యక్రమాలు ఉపేక్షించేది లేదని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. మండలంలోలోని రేగులగడ్డ ప్రాంతంలో అక్రమంగా మైనింగ్ నిర్వహిస్తున్నట్లు ఓ దిన పత్రికలో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. ఎక్కడైనా అక్రమ మైనింగ్ జరిగితే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కేసులు నమోదు చేసి, అపరాధ రుసుం వసూలు చేయాలని స్పష్టం చేశారు. వెంటనే ఆ ప్రాంతాన్ని పరిశీలించి, సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, ఆ బురద వాళ్ల ముఖాలపైనే పడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. 2014 నుంచి టీడీపీ నాయకులు నియోజకవర్గంలో అక్రమ మైనింగ్, పేకాట క్లబ్బులు, గంజాయి అమ్మకాలు, అక్రమ మద్యం విక్రయాలు, లైంగిక దాడులు యథేచ్ఛగా చేశారని మండిపడ్డారు. త్వరలోనే నిజాలు నిగ్గుతేలుతాయని అన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ జయశ్రీ


మాట్లాడుతున్న ఎంపీపీ కటకం జయశ్రీ

దాచేపల్లి: వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కటకం జయశ్రీ అధికారులను కోరారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. పలు అంశాలపై ప్రజా ప్రతినిధులు చర్చించారు. సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరు కావటంపై ప్రజాప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ జయశ్రీ మాట్లాడుతూ.. గ్రామాల్లోని బోర్ల మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు సమావేశంలో పాల్గొనేలా.. చూడాలని ఎంపీడీఓ వై.మహాలక్ష్మికి సూచించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ మూలగొండ్ల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ కందుల జాను, తండా అబ్దుల్ సత్తార్, సొసైటీ చైర్మన్ బత్తుల లింగారెడ్డి, మాజీ జడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఈఓపీఆర్డీ మాధవిలత, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

నకరికల్లు: గంజాయి రవాణా, విక్రయిస్తున్న ముగ్గురిని సత్తెనపల్లి రూరల్ సీఐ ఆర్ ఉమేష్ అరెస్ట్ చేసినట్లు నకరికల్లు ఎస్ఐ సురేష్ మంగళవారం తెలిపారు. మండలంలోని చాగల్లు గ్రామానికి చెందిన షేక్ బాలసైదా, చౌటపాపాయపాలేనికి చెందిన సాధుపాటి శ్రీనివాసరావు, దుర్గి మండలానికి చెందిన సంకురాత్రి రామాంజమ్మ గంజాయి విక్రయిస్తుండగా అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. వారి వద్ద నున్న 750 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని, కోర్టుకు హాజరుపర్చినట్లు తెలిపారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం

దుర్గి: ముటుకూరు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముటుకూరు గ్రామానికి చెందిన పూజల వీరయ్య, రావమ్మ దంపతులు 1958, మార్చి 1న ఆలయాన్ని నిర్మించారు. ధర్మకర్త లింగ నారాయణ ఆధ్వర్యంలో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. తిరునాళ్ల సందర్భంగా మహా అన్నదానం నిర్వహించనున్నారు. ఇతర జిల్లాల నుంచి తరలివస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని వసతులను ఏర్పాటు చేసినట్లు స్థానిక సర్పంచి తోటకూర నాగేశ్వరరావు తెలిపారు.

ముటుకూరు తిరునాళ్లకు పటిష్ట భద్రత

దుర్గి: మండల పరిధిలోని ముటుకూరు గ్రామంలో బుధవారం నిర్వహించనున్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ల మహోత్సవానికి పటిష్ట భద్రతా చర్యలు తీసుకున్నట్లు కారంపూడి సీఐ జయకుమార్ మంగళవారం తెలిపారు. ముటుకూరు గ్రామాన్ని సందర్శించిన ఆయన స్థానిక పోలీసులకు తగు సూచనలు చేశారు. డీఎస్పీ ఆధ్వర్యంలో నలుగురు సీఐలు, పదిమంది ఎస్ఐలు, వంద మందికి పైగా పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విద్యుత్ ప్రభల నిర్వాహకులతో ఆయన మాట్లాడారు. తిరునాళ్లను విజయవంతం చేయడానికి సహకరించాలని కోరారు. వాహనాలను పోలీసులు సూచించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే ఉంచాలని చెప్పారు. ఆయన వెంట ఎస్ఐ కె.సతీష్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యాచ రచనలో విద్యార్థిని ప్రతిభ


ప్రశంసా పత్రం అందుకుంటున్న ప్రవళిక

దాచేపల్లి: కేసానుపల్లి గీతా గురుకులం విద్యార్థిని గంటా ప్రవళిక సౌత్ సెంట్రల్ స్థాయిలో జరిగిన వ్యాసరచన పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిందని ప్రిన్సిపల్ అనిశెట్టి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఏఎండీ ఆధ్వర్యంలో అటామిక్ ఎనర్జీ న్యూక్లియర్ రియాక్టర్ అనే అంశంపై ప్రవళిక వ్యాసం బహుమతి గెలుచుకుందని చెప్పారు. ప్రశంసా పత్రాన్ని ఎంఈవో శ్రీనివాసరావు అందించినట్లు తెలిపారు.

ఘనంగా టైలర్స్ డే


విలియం హోవే చిత్రపటానికి టైలర్స్ నివాళి

కారెంపూడి: టైలర్స్ డేని స్థానిక చెన్నకేశవస్వామి దేవాలయంలో మంగళవారం దర్జీలు నిర్వహించారు. కుట్టు మిషన్ కనిపెట్టి ప్రపంచానికి అందించిన అమెరికాకు చెందిన విలియమ్స్ హోవే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా టైలర్స్ అసోషియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్ నజీర్, మాలపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దర్జీల జీవితం భారమవుతున్న తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేదోడు పథకం ద్వారా టైలర్‌కు రూ.10 వేల చొప్పున ఆర్థిక చేయూతనందిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. కుట్టు పరిశ్రమను ప్రభుత్వం మరింత ప్రోత్సహించి, ఆదుకోవాలని కోరారు. షాపుల్లో కార్మికులుగా టైలరింగ్ చేస్తున్నవారికి కూడా చేదోడు పథకాన్ని వర్తింపజేయాలని మండల అధ్యక్షుడు సయ్యద్ మస్తాన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సూర్యకిరణ్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అసోషియేషన్ ప్రతినిధులు జె.సత్యనారాయణ, జరపాల కొండానాయక్, గుళ్లపల్లి సైదా, బాజి, సైదా, టైలర్స్ పాల్గొన్నారు.

రెంటచింతలలో..

రెంటచింతల: రెంటచింతలలో మంగళవారం టైలర్స్ యూనియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుట్టు మిషన్ ఆద్యుడు విలియమ్స్ చిత్రపటానికి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు ఎస్.రంగా, సభ్యులు చంద్రం, కిశోర్, తిరుపతిరావు, మస్తాన్, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాలలో మంగళవారం వైద్య సిబ్బంది విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జి.రంగాచార్యులు, అసిస్టెంట్ ప్రిన్సిపల్ శరత్‌బాబు, అధ్యాపకులు చందు ఆంజనేయులు, హేమాంబర్‌రెడ్డి, గోపయ్య, నాగేంద్రబాబు, శ్రీను నాయక్, ఏఎన్‌ఎం కుమారిబాయి తదితరులు పాల్గొన్నారు.

దర్జీలకు సన్మానం


టైలర్స్‌ని సన్మానించిన రోటరీ సభ్యులు

మాచర్ల: పట్టణంలో రోటరీ క్లబ్, పఠాన్ బుడే సాహెబ్ చారిటబుల్ ఆధ్వర్యంలో టైలర్స్ డే మంగళవారం ఘనంగా నిర్వహించారు. రోటరీ క్లబ్ సీనియర్ జిల్లా నాయకుడు కె.రామకోటయ్య, ట్రస్టు నిర్వాహకులు నాగూర్‌వలి పాల్గొని, మాట్లాడారు. మెడికల్ అసోసియేషన్ హాలులో దర్జీలు ఆముదాల సుబ్బారావు, తిరివీధి శేషగిరిరావు, తిరునగరి బాబురావు, యిమ్మడి దుర్గా లక్ష్మి, మస్తాన్‌వలి తదితరులను ఘనంగా సత్కరించారు. క్లబ్ సభ్యులు జియాలజిస్టు శంకర్, క్లబ్ అధ్యక్షులు మస్తాన్‌వలి, చిన్ని సత్యనారాయణ, కోశాధికారి నాగార్జునరెడ్డి, పద్మావతి మెడికల్స్ లక్ష్మీనారాయణ, ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ శర్మ, నరసింహారావు, వెంకట్రామయ్య, చందోలు నాగేశ్వరరావు, కేసీపీ వాసు, సుబ్బారావు పాల్గొన్నారు.

■ అధినేతకు ఆత్మీయ స్వాగతం




మాచర్ల: రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ నగదు విడుదల చేసేందుకు తెనాలికి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంగళవారం ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు.

రైళ్లలో వన్యప్రాణుల అక్రమ రవాణా నేరం


మాట్లాడుతున్న ఆర్‌పీఎఫ్ సీఐ నాగార్జునరావు

పిడుగురాళ్ల: రైళ్లల్లో వన్య ప్రాణుల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పిడుగురాళ్ల ఆర్‌పీఎఫ్ సీఐ నాగార్జునరావు హెచ్చరించారు. పట్టణంలోని రైల్వే ఆర్‌పీఎఫ్ కార్యాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నాగార్జునరావు మాట్లాడారు. రైళ్లల్లో నిషేధిత మద్యాన్ని, సిగరెట్లు, తంబాకు వంటివి రవాణా చేయకూడదని స్పష్టం చేశారు. ఎవరైనా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల మంగళగిరిలో రాయి తగిలి లోకో పైలెట్ కంటికి గాయమైందని తెలిపారు. విద్యార్థులు శని, ఆదివారాల్లో రైల్వే ట్రాక్‌ల వద్ద ఆటలాడకూడదని, రాళ్లు రైల్వే పట్టాలపై వేయకూడదని స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు, పాఠశాలలకు నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. త్వరలోనే వందేభారత్ ట్రెన్ కూడా ఈ మార్గంలో పరుగులు పెట్టనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ మధుసూదన్‌రావు, ఎస్ఈబీ సీఐ ఎస్.కొండారెడ్డి, ఎస్ఐ దీప్తి, పలువురు రైల్వే అధికారులు పాల్గొన్నారు.

రీ-సర్వేకు పట్టణ ప్రజలు సహకరించాలి

మున్సిపల్‌చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు


సమావేశంలో సమస్యలను వివరిస్తున్న కౌన్సిలర్ వాసుదేవరెడ్డి

పిడుగురాళ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద పట్టణంలో డ్రోన్ సర్వే మొదలైందని, పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకటసుబ్బారావు కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం చైర్మన్ అధ్యక్షతన అత్యవర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతంలోని వ్యవసాయ, నివాస, నివాసేతర భూములను సర్వే చేస్తున్నట్లు తెలిపారు. నూతన మున్సిపల్ భవన నిర్మాణానికి బ్యాంక్ రుణం రూ. 8 కోట్లు, పురపాలక సాధారణ నిధులు రూ.4.25 కోట్లు మొత్తం రూ. 12.25 కోట్లతో అనుమతుల కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పట్టణంలోని మూడు ప్రాంతాల్లో నిర్మించనున్న మరుగుదొడ్ల నిధులపై కౌన్సిలర్ కత్తెరపు వాసుదేవరెడ్డి ప్రశ్నించారు. కమిషనర్ వెంకటేశ్వర్లు సమాధానమిస్తూ.. కాంట్రాక్టర్లు నిర్మిస్తారని, నిర్వహణకు కొంత నగదు వసూలు చేస్తారని, కాంట్రాక్ట్ కాలం పూర్తయితే.. మున్సిపల్ కార్యాలయానికి అప్పగిస్తారని చెప్పారు. హైస్కూల్ సమీపంలో రోడ్డుపైకి వస్తున్న తోపుడు బండ్లతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని, వేసవిలో నీటిఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ కిరణ్‌కుమార్ కౌన్సిల్ ముందుకు తీసుకొచ్చారు. అలాగే కౌన్సిలర్లు కొక్కెర శ్రీను, గుర్రం అప్పిరెడ్డి, అన్నెం పద్మావతి తమ వార్డుల్లో సమస్యలను వివరించారు. వాటన్నిటిని పరిష్కరిస్తామని మున్సిపల్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు, డీఈ సత్యనారాయణ, మేనేజర్ శివశంకర్ ప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆదర్శంగా దాచేపల్లి నగర పంచాయతీ

చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ


చైర్మన్ సుబ్బమ్మ దంపతులను సన్మానిస్తున్న కౌన్సిలర్లు

దాచేపల్లి : నగర పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అన్నారు. నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం సచివాలయం-1లో మంగళవారం జరిగింది. మాజీ చైర్మన్, దివంగత మునగా రమాదేవి, పంప్ ఆపరేటర్ గరికపాటి కోటేశ్వరరావు మృతికి సభ్యులు సంతాపం తెలిపారు. అనంతరం రూ.15 కోట్లతో చేపట్టనున్న పనులకు కౌన్సిల్‌లో చైర్‌పర్సన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ్యులు ఆమోదించారు. అభివృద్ధి పనులను చైర్‌పర్సన్ సభ్యులకు వివరించారు. గురజాల మాజీ ఎమ్మెల్యే, దివంగత మందపాటి నాగిరెడ్డి విగ్రహం ఏర్పాటుకు సభ్యులు అంగీకారం తెలిపారు. ఇరికేపల్లికి చెందిన ది మదర్ స్వచ్ఛంద సేవా సంస్థ హరిత నగరాలు కార్యక్రమం ద్వారా నాటిక మొక్కల నీటి సరఫరాకు అనుమతిచ్చారు. చైర్ పర్సన్ సుబ్బమ్మ మాట్లాడుతూ.. నగర పంచాయతీలో మౌలిక వసతుల కల్పన, తాగునీటి సమస్యపై ప్రధానంగా దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రభుత్వం కేటాయించిన రూ.16.50కోట్లతో ఇంటింటికీ తాగునీరు అందించే పనులు వేగంగా చేస్తామని చెప్పారు. నగర పంచాయతీ అభివృద్ధి బాధ్యతను కౌన్సిలర్లు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌బాషా, కొమెరబత్తిన అన్నపూర్ణ, ఆర్ఐ ప్రసాద్, డీఈ సత్యనారాయణ, కౌన్సిలర్లు చాట్ల క్రాంతికుమార్, శ్రీరాం పోలు, నాగుబండి గురువులు, వందనపు లక్ష్మి, మందపాటి సౌజన్య, ఈదా శశిదేవి, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ రఫీ, గుంజా వెంకటప్పయ్య, వేల్పుల అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులతోనే మైనింగ్

మైనింగ్ ఏడీ రామ్మోహన్‌రావు


క్వారీని పరిశీలిస్తున్న మైనింగ్ ఏడీ

మాచవరం: మండలంలోని వేమవరం గ్రామ రెవెన్యూ శివారులోని రేగులగడ్డ ప్రాంతంలో ముగ్గురాయి మైనింగ్ నిర్వహణకు అనుమతులున్నట్లు గనులు, భూగర్భ శాఖ దాచేపల్లి ఏడీ డి.రామ్మోహన్‌రావు తెలిపారు. మంగళవారం ఓ దిన పత్రికలో నదీ గర్భంలో గనుల దందా శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. మైనింగ్ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైనింగ్ నిర్వహణ లీజు కొరకు 2010లో హైదరాబాద్‌కు చెందిన శ్రీలక్ష్మి మైన్స్ అండ్ మినరల్స్ పేరుతో అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. రెవెన్యూ అధికారులు ఎన్‌ఓసీ, పర్యావరణ, కాలుష్య నియంత్రణ శాఖల అనుమతులు, మైనింగ్ ప్లాను ఆమోదం పొందిన తర్వాతనే మైనింగ్ నిర్వహణకు 2019లో అనుమతులిచ్చినట్లు తెలిపారు. ఇటీవల మైనింగ్ ప్రాంతాన్ని మైనింగ్ సర్వేయర్ పరిశీలించడం జరిగిందని, అనుమతులు ఇచ్చిన ప్రాంతంలోనే మైనింగ్ నిర్వహణ జరుగుతున్నట్లు నిర్ధారించారు. లీజుదారుడు ఇప్పటికే ప్రభుత్వానికి రూ.31.50 లక్షలు రాయల్టీ చెల్లించినట్లు వివరించారు. నిబంధనలకు లోబడి క్వారీ పనులు చేస్తున్నారని తెలిపారు. అక్రమ మైనింగ్ కథనం అవాస్తవమని స్పష్టం చేశారు. ఇలాంటి తప్పుడు కథనాలు ప్రచురించడం తగదన్నారు. అక్రమ మైనింగ్ జరుగుతున్నట్లు తమ దృష్టికి తీసుకువస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. మైనింగ్ అధికారి ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.